ఉచిత శిక్షణ.. భవితకు నిచ్చెన

- పేద విద్యార్థులకు అండగా ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ
- ఎన్‌ఎంఎంఎస్‌లో నాలుగేళ్లుగా శిక్షణ
- ఉపాధ్యాయులు, అధ్యాపకుల సేవాభావం



విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై గణితం బోధిస్తున్న అధ్యాపకుడు చిన్నయ్య



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు హాజరైన విద్యార్థులు

తగరపువలస: చిట్టివలసకు చెందిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది. సొసైటీ సేవా కార్యక్రమాల్లో భాగంగా నాలుగేళ్లుగా 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)లో ఉచిత శిక్షణ ఇస్తోంది. డిసెంబర్ 8న జరగనున్న ఈ పరీక్షకు సంబంధించి ప్రస్తుతం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఉచిత శిక్షణ తరగతులకు భీమిలి అర్బన్, రూరల్ పాఠశాలలకు చెందిన 186 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. కేంద్ర విద్యా శాఖచే నిర్వహించే ఈ పరీక్ష మూడు గంటల పాటు 180 మార్కులకు 180 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో మెంటల్ ఎబిలిటీపై 90 ప్రశ్నలు, ఫిజిక్స్ 12, కెమిస్ట్రీ 11, బయాలజీ 12, గణితం 20, హిస్టరీ 10, జాగ్రఫీ 10, పొలిటికల్ సైన్స్ 10, అర్థశాస్త్రం నుంచి 5 ప్రశ్నలు ఉంటాయి. ఈ ఉచిత శిక్షణ 6 నెలల పాటు సెలవు రోజుల్లో సాగుతుంది. శిక్షణలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సేవాభావంతో పాల్గొంటున్నారు. వీరిలో యాగాటి వెంకటరమణ, దత్తి రవి, పి.శ్రీనివాసరావు, ఎల్.ఎ.శ్రీను, శివకుమార్, పి.నాగేశ్వరరావు, సాయి విమల, దయానంద్, మాదాబత్తుల సూర్యనారాయణ, బి.జె.వి.రమణ, ఆనంద్, మారుతీ గణేష్, జగన్ తదితర నిపుణులైన ఉపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లు ఉన్నారు.

7 సీట్లతో బోణీ..

నాలుగేళ్ల కిందట ఉచిత శిక్షణ ప్రారంభించిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏడు సీట్లు సాధించారు. తరువాత రెండేళ్ల పాటు 22, 18 సీట్లు పొందారు. ఈ ఏడాది 75కు పైగా సీట్లు సాధించే దిశగా శిక్షణ కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద స్థాయిలో ఉచిత శిక్షణ సాగిస్తున్న సొసైటీ ఇదే. ఈ పరీక్షలో ఎంపికైన పేద విద్యార్థులకు నాలుగేళ్ల పాటు నెలకు రూ.1,000 వంతున 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రూ.48 వేలు కేంద్ర విద్యా శాఖ అందిస్తుంది.

స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం..

సొసైటీ ఉచిత శిక్షణతోపాటు విద్యార్థులకు ప్రతి రోజూ ఈవెనింగ్ స్నాక్స్, డ్రింకింగ్ వాటర్ తదితర సదుపాయాలు కల్పిస్తుండగా.. ఈ ఏడాది నుంచి చిట్టివలస సత్యసాయి సేవా సమితి, వింగ్స్ ఫౌండేషన్, స్విగ్ధశ్రీ ఫౌండేషన్, దత్తి ఈశ్వరరావు, నందిక శ్రీను, శివకుమార్, గొట్టిపల్లి సత్యనారాయణ తదితరులు విద్యార్థులకు మెటీరియల్, స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ అందిస్తున్నారు.

పోటీ పరీక్షలకు ఉపయుక్తం



ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటి నుంచే పోటీ పరీక్షలకు అలవాటు పడతారు. అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించగలుగుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉచితంగా ఇంత పెద్ద శిక్షణ ఇవ్వడం లేదు. మాతోపాటు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుల పట్టుదల చూస్తే 100 మందికి పైగా స్కాలర్‌షిప్‌లు సాధిస్తాం.

– గంటాన మోహనరావు, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు

సృజనాత్మకత పెరుగుతుంది



ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. పునాది గట్టి పడి వారి ఆలోచన శక్తి పెరుగుతుంది. మంచి మార్కులు సాధించగలరు. సాధారణంగా పోటీ పరీక్షలకు ఎవరూ ఉచితంగా శిక్షణ ఇవ్వరు. డబ్బులు ఇచ్చినా గ్యారంటీ ఇవ్వలేరు. మాకు 20 మందికి పైగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉపకార వేతనం గ్యారంటీ అంటూ ప్రోత్సహిస్తున్నారు.

– రేక అప్పారావు, సొసైటీ ప్రధాన కార్యదర్శి

మెంటల్ ఎబిలిటీపై పట్టు



ఈ పోటీ పరీక్ష ద్వారా 8వ తరగతిలోనే మాకు మెంటల్ ఎబిటిటీపై అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో పోటీ పరీక్షలు దీటుగా ఎదుర్కోగలం. మాలాంటి పేద విద్యార్థులు ఈ పరీక్షలో అర్హత సాధించగలిగితే ఏటా రూ.12 వేల ఉపకార వేతనం లభిస్తుంది. మాకు ఇది చాలా పెద్ద సాయం.

– వై.ఉమాభార్గవి, మూలకుద్దు

సబ్జెక్టులపై మరింత అవగాహన



ఇప్పుడు ఉపాధ్యాయులు ఉచితంగా ఇస్తున్న శిక్షణ మాకు ఇంటర్మీడియట్ వరకు ఉపయోగపడుతుంది. మిగిలిన విద్యార్థుల కంటే ముందు ఉంటాం. ఇప్పుడే వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించడం ద్వారా 10వ తరగతి తరువాత ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు అర్హత సాధించగలుగుతాం. మాపై మరింత నమ్మకం పెరుగుతుంది.

– టి.పూజిత, వెల్లంకి

ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీ



ఇది జాతీయ స్థాయి పరీక్ష కావడంతో ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీ పడుతున్నాం. సొసైటీ నిర్వాహకుల శ్రమ, ఉపాధ్యాయుల పట్టుదలకు స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహం బాగుంది. సెలవు రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ తీసుకోగలుగుతున్నాం. అన్ని సబ్జెక్టుల్లో కష్టపడే వారికే మంచి ఫలితం దక్కుతుంది.

– ఎం.ఓంకార్, భీమిలి

నివాసాల మధ్యలో వైన్ షాప్

నగరంపాలెం వాసుల ఆగ్రహం



నగరంపాలెం రోడ్డులో ఏర్పాటు చేస్తున్న వైన్ షాప్

మధురవాడ: నగరంపాలెం రోడ్డులో పైడితల్లి అమ్మవారి గుడికి అత్యంత సమీపంలో నివాసాల మధ్య వైన్ షాప్ ఏర్పాటు చేస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓల్డేజ్ హోమ్, నర్సింగ్ హాస్టల్ వంటివి కూడా ఈ గ్రూప్ హౌస్‌లోనే ఉన్నాయి. ఇది వారి రక్షణకు విఘాతం కలిగిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఎక్సైజ్ పోలీసులు తక్షణమే ఇక్కడ వైన్ షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'రేషన్ డిపో 15ను యథావిధిగా కొనసాగించవచ్చు'

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతబయలు, డోర్ నంబర్ 6–45–185లో కొనసాగుతున్న 15వ నంబర్ రేషన్ డిపోను యథాతధంగా కొనసాగించవచ్చని ఈ నెల 7న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. డీలర్ ఉప్పల చిన వెంకటరమణ గతంలో 5–48–38లో ఈ రేషన్ దుకాణం నిర్వహించేవారు. అనివార్య కారణాల వల్ల ఈ డిపోను అధికారుల సమాచారంతో పక్కనే ఉన్న 6–45–185 డోర్ నంబర్‌కు మార్చారు. దీనిని ఆక్షేపిస్తూ సదరు డీలర్ కుమారుడు రమేష్‌బాబు గతేడాది పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో డీలర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. స్టే మంజూరు చేసి అక్కడే కొనసాగించుకోచ్చని అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం న్యాయస్థానం తీర్పులో రమేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు చెల్లదని, దానిపై ఆర్డీవో సస్పెన్షన్ ఎత్తేవేసి యథావిధిగా డిపో కొనసాగించుకోవచ్చని తెలిపింది.

క్లుప్తంగా

ఘనంగా మరిడమ్మ ఉత్సవం



సతకం పట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఆదివారం మరిడమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సతకం పట్టు వద్ద గ్రామస్తులు పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా కురపల్లి వద్ద ఉన్న మరిడి పట్టు వద్దకు వెళ్లి పూజలు జరిపారు. పాండ్రంగిలో ఈ నెల 13, 14 తేదీల్లో బంగారమ్మ ఉత్సవాలు జరుగుతాయి. దీనిలో భాగంగా ముందుస్తుగా మరిడమ్మ ఉత్సవం నిర్వహించారు.

పేదలకు వితరణ



మహిళలకు చీరలు అందిస్తున్న గ్లోబల్ ఫౌండేషన్ సీఈవో పండేటి

పద్మనాభం: తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతామని యూఎస్‌ఏ దేశం బోస్టన్‌లోని గ్లోబల్ ఫౌండేషన్ సీఈవో భూపతిరాజు పండేటి తెలిపారు. మండలంలోని పాండ్రంగిలో ఆదివారం 25 మంది పేద మహిళలు, వృద్ధులకు చీరలు, పంచెలు ఫౌండేషన్ తరఫున ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడానికి 75 గ్రామాలను దత్తత తీసుకున్నామన్నారు. వీటిలో పద్మనాభం మండలంలోని పాండ్రంగి, రేవిడి, విజయనగరం జిల్లాలోని అలమండ, జొన్నవలస గ్రామాలను దత్తత తీసుకున్నట్టు చెప్పారు. ఈ గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పల నరసింహరాజు, సాగి ప్రశాంత్‌రాజు, పల్లి మహేష్, మహంతి అప్పలరమణ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

పాఠశాలకు దారేది..?



ఆనందపురం జెడ్పీ హైస్కూల్ గేటు ఎదురుగా దుకాణాలు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ మెయిన్ గేటును ఆనుకుని స్థానిక చిరు వ్యాపారులు నిత్యం దుకాణాలు సర్దేస్తున్నారు. ఉపాధ్యాయులు, తమ ద్విచక్ర వాహనాలు, కార్లుపై వచ్చినా లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా అడ్డం పెట్టేస్తున్నారు. చివరకు విద్యార్థుల సైకిళ్లు కూడా లోపలకు తీసుకు వెళ్లలేకపోతున్నారు. అడపాదడపా మండల, జిల్లా విద్యా శాఖ అధికారులు వచ్చినా ఇదే పరిస్థితి. ఒక్కోసారి స్థానికులు తమ పశువులను కూడా గేటుకు కట్టేస్తున్నారు. పాఠశాల మెయిన్ గేటు నుంచి ఎదురుగా వేములవలస బీటీ రోడ్డు వరకు మొత్తం సీసీ రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాగర తీరానికి పోటెత్తిన జనం



కార్తీక మాసం, ఆదివారం కావడంతో సాగర తీర పర్యాటక ప్రాంతాలన్నీ జనంతో పోటెత్తాయి. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ, బావి కొండ, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, మంగమారిపేట బీచ్, భీమిలి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది. పెద్దలు, చిన్నారుల కేరింతలు, ఆటపాటలతో ఈ తీర ప్రాంతాల్లో అందరూ సరదాగా గడిపారు. – కొమ్మాది

మహా సదస్సును జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమ్‌సేన వార్ ప్రతినిధులు

తగరపువలస: 'భారత రాజ్యాంగం–ప్రజాస్వామ్యం, ఎన్నికలు–ప్రజాసంక్షేమం' అనే అంశంపై ఈ నెల 24న నగరంలోని రామాటాకీస్ అంబేడ్కర్ భవన్‌లో జరగనున్న మహా సదస్సును జయప్రదం చేయాలని భీమ్‌సేన వార్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. సంతపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం పోస్టర్ విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల జరిగే ఈ సదస్సుకు భీమిలి నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది హాజరు కావాలని కోరారు. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఆచార్యుడు జి.హరగోపాల్, ప్రొఫెసర్ బాలబోయిన సుదర్శన్, గాయకులు ఉదయ భాస్కర్, సుక్క రాంనరసయ్య తదితరులు ప్రసంగించనున్నారని చెప్పారు. సదస్సుకు హాజరైన వారికి రాజ్యాంగ ప్రతులు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో భీమ్‌సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గుడివాడ అప్పారావు, కోశాధికారి బల్లంకి కనకరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రవికుమార్, శంకర మహంకాళి, భీమిలి గౌరవ అధ్యక్షుడు గాదం మహేష్, అధ్యక్షుడు గాదం ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ మద్దిల సుబ్బారావు, కోశాధికారి టీఎస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవండి



కౌన్సెలింగ్ ఇస్తున్న విశాఖ నార్త్ జోన్ ఏసీపీ వెంకటరావు

పీఎం పాలెం: చోరీలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, అమాయకులపై దౌర్జన్యం చేసి అక్రమంగా వసూళ్లకు దిగడం వంటి కార్యకలాపాలు సాగించే వారు పోలీసుల నుంచి తప్పించుకోలేరని విశాఖ నార్త్ డివిజన్ ఏసీపీ ఎ.వెంకటరావు అన్నారు. నార్త్ డివిజన్ పరిధిలో చోరీలకు పాల్పడి అరెస్టయిన ఆనందపురం, భీమిలి, పద్మనాభం పీఎం పాలెం ప్రాంతాలకు చెందిన నిందితులకు పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి అలవాటు పడిన వారిపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఎంటుందని హెచ్చరించారు. తప్పుడు దారిని విడనాడి సన్మార్గంలో నడిచే వారికి భవిష్యత్ ఉంటుదని సూచించారు. నేర ప్రవృత్తిని విడనాడక పోతే జీవితం నాశనం అవడంతోపాటు కుటుంబ సభ్యులకు చెడ్డపేరు రావడానికి కారకులవుతారన్నారు. వారం వారం విధిగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ ఉనికిని తెలియ పరచాలని చెప్పారు. లేనిపక్షంలో చట్టపరంగా శిక్ష తప్పదని ఏసీపీ హెచ్చరించచారు. కార్యక్రమంలో స్థానిక నేర విభాగం సీఐ బీఎస్ఎస్ ప్రకాష్, ఎస్ఐ ఆర్ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఒమ్మి తరణ్



కొమ్మాది: జాతీయ స్థాయిలో మైసూర్‌లో త్వరలో జరగనున్న రోలర్ స్కేటింగ్ చాపియన్‌షిప్ పోటీలకు ఎండాడకు చెందిన ఒమ్మి తరణ్ యాదవ్ ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో 5, 6 ర్యాంకుల్లో ఈ బాలుడు ప్రతిభ చూపి రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా తరణ్‌ను వీఎంఆర్‌డీఏ సంయుక్త కమిషనర్ కె.రమేష్ తదితరులు అభినందించారు.

కార్తీక దీపం విశిష్టతపై ప్రచారం



సత్యనారాయణపురంలో ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేస్తున్న త్రైత సిద్ధాంత సభ్యులు

పద్మనాభం: మండలంలోని ఐనాడ, సత్యనారాయణపురం గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు కార్తీక దీపం విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీతలపై ప్రచారం చేశారు. కార్తీక పౌర్ణమి రోజున దేవాలయాల్లో ధ్వజ స్తంభంపైన దీపం వెలిగించడం వల్ల ధ్వజస్తంభం నుంచి దేవుని రాజ్యం ప్రారంభమై గర్భగుడిలోని భగవంతుని వరకు దైవ రాజ్యమే ఉంటుందని మహిళలకు తెలియజేశారు. కార్తీక మాసం డిసెంబర్ ఒకటి వరకు ఉంటుందని, అందరూ దీపారాధన చేయాలని సూచించారు. గ్రామస్తులకు భగవద్గీత తదితర ఆధ్యాత్మిక పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, టి.సురేష్, బి.పైడన్న, ఎస్.అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి సాగరదుర్గ ఉత్సవాలు



మద్దిలో సాగరదుర్గ ఆలయం

పద్మనాభం: మండలంలోని మద్దిలో నూతనంగా నిర్మించిన సాగరదుర్గ అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్టు మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. 11న గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచ గవ్య ప్రాశన, రక్షా బంధనం, యాగశాల ప్రవేశం, దీపారాధన, అగ్నిప్రతిష్ట, హోమాలు వంటి పూజా కార్యక్రమాల నిర్వహణతోపాటు అమ్మవారి ఉత్సవ మూర్తులు, శిఖర పూర్ణ కలశాన్ని ఊరేగించనున్నట్టు చెప్పారు. 12న విశేష హోమాలు, జలాది, క్షీరాది, ధాన్యాది వాసాలు, 13న దిష్టి కుంభం, దర్బ, సర్వ దర్శనాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

మధురవాడ: కూటమి ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు ఇస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. ప్రజా చైతన్య ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంపాలెంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ప్రతి ఇంటికి వెళ్లి గతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వని వారు, వైఎస్సార్‌సీపీ సెంటు స్థలం ఇచ్చిన వారి నుంచి కూడా దరఖాస్తులు తీసుకుని, అందరికీ 2 సెంట్లు స్థలాలు ఇవ్వాలని ఈ నెల 18 నుంచి వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.4 లక్షలు ఇస్తామని చెప్పిందని, కనీసం రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతామన్నారు. తమ పార్టీ తరఫున వారం రోజుల పాటు దరఖాస్తులు నింపించి సచివాలయాల్లో అందిస్తామని చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, వి.రమణ, కె.చిన్న, ఎస్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అర్మాన్ మాలిక్ మ్యూజికల్ షో



పాటతో ఉర్రూతలూగిస్తున్న అర్మాన్ మాలిక్

కొమ్మాది: బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో తన పాటలతో అలరించారు. లైవ్ ఇన్ కాన్సెప్ట్ పేరుతో జరిగిన సంగీత కార్యక్రమంలో బోల్ దో నా జరా, బుట్టబొమ్మ తదితర పాటలు పాడి యువతను ఉర్రూతలూగించారు. ఆయన పాటలు పాడుతుంటే యువత స్వరం కలుపుతూ, డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేశారు.

సత్యదేవ వ్రతాలు రేపు

- తగరపువలస కొండపై ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సకల ఏర్పాట్లు



ఆలయంలో శ్రీరమా సత్యనారాయణ స్వామి

తగరపువలస: కార్తీక మాస శుద్ధ ఏకాదశి ఘడియలు సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రవేశించనున్నాయి. దీంతో తగరపువలస కొండపై గల శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం వరకు అమ్మవారు, స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించనున్నారు. మంగళవారం వేకువజాము నుంచి ఇదే కొండపై ఆలయ మండపం, ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిపించనున్నట్టు అర్చకులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా అన్నవరం సత్యదేవుని ఆలయానికి వెళ్లలేని వారు తగరపువలసలోని ఈ కొండపైకి వస్తుంటారు. ఇక్కడ పూజలు, వ్రతాల నిర్వహణకు గాను భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా దేవదాయ శాఖ ఆలయానికి పెయింటింగ్ పనులు, మెట్లకు పసుపు–కుంకుమలు, మెట్ల మార్గం నుంచి ఆలయ శిఖరం వరకు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

పీఎం పాలెం: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా.. 8వ వార్డు ధర్మపురి కాలనీలో చల్లా జ్యోతి తన కుమార్తె, కుమారుడు చల్లా అజయ్ సాయిదిలీప్(26)తో కలిసి నివసిస్తున్నారు. ఆమె భర్త ఐదేళ్ల కిందట మరణించాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన సాయిదిలీప్ ఏడాదిగా వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం స్వీట్లు తీసుకొద్దామని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి ఫోన్ చేసి.. ఇంటికి వచ్చేస్తున్నాను, మరేమైనా ఆహార వస్తువులు కావాలా అని తల్లిని అడిగాడు. ఆ తరువాత ఎంత సేపటికీ కుమారుడి వద్ద నుంచి ఫోన్ రాలేదు. తిరిగి ఫోన్ చేస్తే సమాధానం లేదు. రాత్రి 11 గంటల సమయంలో హ్యుండయ్ షోరూం ఎదురుగా రోడ్డు దాటుతుండగా ఎండాడ వైపునకు వెళ్తున్న బైకు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అజయ్ దిలీప్‌ను వెంటనే గీతం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు మెడికవర్ హాస్పిటల్ తీసుకెళ్లగా.. అప్పటికే యువకుడు మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆదివారం మృతుడి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో ఆదివారం బీజేపీ నాయకులు సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. 160 మందికి సభ్యత్వాలు ఇచ్చారు. భీమిలి నియోజకవర్గం బీజేపీ సభ్యత్వ నమోదు ప్రముఖ్ జేవీ కైలాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండారు అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గెద్ద అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంగివలస చెరువు దుర్గంధభరితం



సంగివలస చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస కొత్త మ్మతల్లి ఆలయాన్ని ఆనుకుని ఉన్న చెరువు నుంచి దుర్గంధం వస్తోందని వాకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌పై పలువురు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, రన్నింగ్ చేస్తుంటారు. ఈ చెరువును ఆనుకునే చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు సెలవు రోజుల్లో ఆటలు ఆడుకుంటుండగా ఆ పక్కనే కుటీరాల్లో వృద్ధులు సేద తీరుతుంటారు. ప్రస్తుతం చెరువు నుంచి వస్తున్న దుర్గంధం కారణంగా ఇటువైపు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది తరచూ చెరువు చుట్టూ నిర్వహణ పనులు చేపడుతున్నా.. వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో లోపాల కారణంగా తరచూ దుర్గంధం వస్తోందని సంగివలస కాలనీవాసులు వాపోతున్నారు. చెరువు ప్రక్షాళన పనులు చేపట్టాలని చెరువు చుట్టూ నివసిస్తున్న వారితోపాటు చిన్నారులు, వాకర్లు, వృద్ధులు కోరుతున్నారు.